# పారిపోయిన అసిస్టెంటు

గొప్ప గొప్ప డిటెక్టివులంతా పట్నంలో ఎందుకుంటారో తెలీటంలా. ఊరంతా సినిమా హాల్లే ఒకటే గోల—పట్నం సినిమా హాళ్ళు మళ్ళీ మవునంగానే ఉంటాయి. చాలామందికి తెలుగు రాదు. పాపం, వాళ్ళు ఎట్లా బతుకుతున్నారో మరి!

‘‘మనం ఏం చేసినా ఇక్కడే చెయ్యాలి గురో!’’ అంటాడు భద్రం.

‘‘ఎందుకట్టా ?’’ అని అడిగాను.

‘‘ఒకటాలోచించండి గురో. కేడీలంతా పట్నం ఎందుకు చేరతారు ? వాళ్ళని గుర్తు పట్టే వాళ్లుండరు గనక ! కారుల్లో, బస్సుల్లో ఇన్ని వేల జనం వెళ్ళుతున్నారు గదా, వీళ్ళల్లో ఎవడు కేడీ అయిందీ, ఎవరు డిటెక్టివయిందీ ఎవడన్నా చెప్పగలడూ? చెప్పలేడు. కేడీలంతా పట్నంలో ఉంటారు గనకనే డిటెక్టివులు

కూడా పట్నం చేరతారు. మనం మన వూళ్లోనే ఉన్నా మను కోండి, ఊళ్ళో వుండే కేడీలంతా మనకు తెలిసేపాయె, మనం డిటెక్టివులమని అందరికీ తెలుసాయె! కేసుల్రావు.''

''భద్రం, ఇహ చెప్పకు. నాకంతా హర్థమయిండి. ఇహ నించీ పట్నమే మన ఊరు'' అన్నాను.

అయితే మాకు సరైన ఆల్మకాం ఏర్పళ్లేదు. భద్రం ధర్మమా అని ఈసారి మేం ఓటలుకు పోలేదు. టెంపరవరీగా మా ఆల్మకాం కోడంబాకంలో ఏర్పాటయింది. అది శానా చిన్నయిల్లు. అంత చిన్నయిల్లు నేనెప్పుడూ చూడలా. మా చుట్టూ ఏ యింట్లో చూసినా ఎగస్ట్రాలే ఉంటారని తెలిసింది. ఇంకొంచెం అవతలికి పోతే స్టూడియోల మయం.

''మొత్తానికి భలే పని చేశావే భద్రం! ఈ సినిమాల మధ్య తెచ్చి పడేశావే. నువు అసిస్టెంటుగా ఉండటం ఇష్టం లేకపోతే సస్పెండయిపో. అంతేగాని ఇదేమంత యిదిగా లేదు!'' అని కఠినంగా అన్నాను.

''అక్కడే మీరు పొరపాటు పడుతున్నారు గురో. మన మిక్కడికెందుకు చేరామో మీరు డిటెక్షన్ చెయ్యాలేకపోయారే, అన్నది నాకు మరింత యిదిగా ఉందన్నమాట'' అన్నాడు భద్రం కూడా కఠినంగానే.

''కొంచెం క్లూ యివ్వగూడదేంటి?'' అన్నాను.

మేమిద్దరమూ వొంగి బయటికొచ్చాం.

''ఆ కనిపించేదేమిటి గురో? పోలీసుస్టేషన్! అందులో ఎవ రుంటారు గురో? సబ్బింటాడు! ఎప్పుడు కావలిస్తే అప్పుడు

మనం కేకెయ్యవచ్చు. ఏమీ ఆలోచించకుండానే మన అల్మకాం ఇక్కడ పెట్టానా ?''

''భేష్, భద్రం! నీవంటి అసిస్టెంటు నాకు దొరకడు!''

''పోలీసు స్టేషను క్లోజప్‌లో చూద్దామా ?'' అన్నాడు భద్రం.

''ఏదీ ? నీ దగ్గరుందా ?'' అన్నాను.

''ఏమిటి, గురో ?''

''అదేమిటో అంటివే, అదే!''

''క్లోజప్పా, గురో ?''

''అవును.''

''క్లోజప్‌లో చూట్టమంటే దగ్గిరిగా చూట్టమన్నమాట, గురో!''

''భద్రం. ఈ మాట ఒక్క డిటెక్టివు నాకొడుక్కీ తెలీదు!'' అన్నాను గొంతు తగ్గించి.

''ఎందుకు తెలీదు, గురో? రహస్యంగా ఉంచుతారు.''

''అట్లాగా ? ఇంకేమన్నా మాటలు నీకు వచ్చా ? నేనెవరికీ చెప్పన్లే!''

''లాంగ్‌షాట్!''

''అంటే ?''

''ఇప్పుడు మనం లాంగ్‌షాట్‌లో పోలీసు స్టేషన్ను చూస్తున్నాం. లాంగ్ అంటే దూరమన్నమాట. షాట్ అంటే—షూట్ అనే మాట విన్నారా?

''ఎక్కడో విన్నట్లే ఉంది భద్రం.''

''షూట్ అంటే గుండేసి కొట్టట మన్నమాట. షాట్ అంటే ఒక యేటనుకోండి. లాంగ్ షాట్ అంటే దూరం యేటు!''

"ఇక చెప్పకు, భద్రం. అంతా తెలిసిపోయింది. ఇంకే మన్నా మాటలు వచ్చా?"

"కట్."

"అంటే?"

"నరికెయ్యటమన్న మాట."

"ఇవన్నీ డిటెక్టివు నా కొడుకులకు తెలీవు భద్రం! వీటిల్లో నేను ఒక్కమాటా వినలేదు. ఇంకేమన్నావస్తే చెప్పెయ్యి!"

"లైట్స్ ఆఫ్—అంటే, దీపాలు ఆర్పెయ్యమని!"

నేను భద్రంకేసి పరీక్షగా చూశాను. వాడి మొహాన ఒక మాదిరి హాశ్చర్యానందం డాన్సు చేస్తున్నది. వాడు మన లోకంలో ఉన్నట్టులేడు.

మేం ఈ ప్రకారంగా మాట్లాడుతూ రోడ్డు చేరే సమయంలో ఒక హాత్యాశ్చర్యం నా కంట్లో పడింది. ఒక పెద్ద చప్పుడు హారన్ చేసుకుంటూ ఒక పెద్ద కారు మావక్కగా దూసుకు పోయింది. అందులో ఒక దేవత కూచుని ఉంది! నిజంగా దేవతే...నవ్వుతాలు కాదు. ఆ దేవత నెత్తిన దగద్ధగా నవ రత్నాల కిరీటం వెలుగుతున్నది. మెడనిండా కోట్ల ఖరీదు చేసే రవ్వల హారాలూ అవీ ఉన్నయి. ఆవిడ కట్టుకున్న బట్టలు చెప్పటానికి వీల్లేదు. అన్నిటికన్న ఆ దేవత మొహం రంగు - హద్భుతం, హాశ్చర్యం. మనుషుల్లో ఎక్కడా ఆటువంటి రంగు కనబడదు. వైకుంఠంలో చూడాల్సిందే! నిజంగా ఆ ధృశ్యం చూసి నా కళ్ళు బైర్లు గమ్మినయి. లేకపోతే ఇంకా బాగా చూసేవాణ్ణే!

అదే సమయంలో భద్రం, "హాత్తెరీ," అంటం గూడా జరిగి పోయింది.

"చూశావా, భద్రం ?" అన్నాను.

"చూశాను గురో !" అన్నాడు భద్రం, హీన స్వరంతో. నేను డిటెక్టివును గనుక తట్టుకున్నాను గాని, అసిస్టెంటు కావటంచేత భద్రం ఆ దృశ్యం చూసి ఢీలా అయిపోయినాడు. అయితే ఒకందుకు నాకు హాశ్చర్య మేసింది. రోడ్డంబడి పోయేవాళ్ళు ఒక్కళ్ళూ మూర్ఛపోలేదు. ఇది గొప్ప మిష్టరీ! అయితే ఈ మిష్టరీని మరుక్షణంలో విచ్చుకొట్టేశాను. ఆ దేవత నాకూ భద్రానికీ మాత్రమే కనిపించి ఉంటుంది. సందేహం లేదు.

"గురో. మీ రట్లా ఒక చుట్టు చుట్టి క్లూలు సంపాయించుకు రండి. నేను ఒకడితో కొంచెం మాట్లాడి రావాలి," అన్నాడు భద్రం.

"సరే వెళ్ళిరా," అన్నాను.

ఇహ భద్రం మళ్ళా నాకు కనిపించడనీ, అదే వాణ్ణి ఆహరు సారి చూట్టమనీ, నేను ఒక మిష్టరీలో చిక్కుకు పోతానని నాకా తక్షణంలో తెలీదు గద !

☼ ☼ ☼

నేను సందుల వెంట పొలాలు వచ్చిందాకా వెళ్ళాను. తరవాత ఇంకోదారిన ఇంకోవేపూ, ఆ తరవాత మరొకదారిన మరొక వేపూ వెళ్ళాను. ఒకచోట కుక్కలు సరసాలాడ్డం తప్ప విశేషా లేమీ కనిపించలేదు. నేను తిరిగిన దారిలో ఒక శవంగాని, రక్తం మడుగుగాని లేదు. ఒక్క చోట మట్టుకు నెత్తురు కక్కుకుంటూ నాకేసి వచ్చే ఒక మనిషిని చూశాను. దగ్గిరికి వచ్చినాక చూస్తే వాడి నోటినిండా తమ్మ ఉన్నది. అందుచేత వాడు కక్కుతున్నది రక్తం కాదన్నమాట. ఇంకా నయం. వాణ్ణి చూడకపోతే అవి రక్తం మరకలనుకుని డిటెక్షన్ ప్రారంభించే వాడినే!

ఇంతకూ అటు తిరిగీ, ఇటు తిరిగీ నాకు వచ్చిన దారి తెలీకుండా పోయింది. పోగాపోగా రైలుపట్టాలు కనబడ్డయి. అక్కడి నించిగేటు చేరి పోలీసు స్టేషనుదాకా నడిచి ఇల్లు చేరాను. అప్పటికి గడియారం పన్నెండూఇరవై కొట్టింది. కాని ఏం లాభం? ఇంట్లో నా అసిస్టెంటు భద్రం లేదు. వాడు పూర్తిగా అదృశ్యమయినాడు. ఒక్క క్లూ కూడా లేదు.

వొంగి బయటికొచ్చి చూస్తే, వేపచెట్టు నీడలో ఒక మనిషి కనిపించాడు. పొడుగ్గా, నల్లగా, తిరిగిన మీసాలు ధరించి ఉన్నాడు.

"మా భద్రం కనిపించాడా ?"

"అటు స్టూడియో కేసి వెళ్ళినట్టుందే ?" అన్నాడు.

"ఏ స్టూడియో?...చెప్పకు," అంటూ కళ్ళు మూసుకుని తీవ్రంగా ఆలోచించ సాగాను.

"వద్దంటే నేనెందుకు చెబుతా?...మోహినీ స్టూడియో!" అన్నాడు.

ఆలోచిస్తున్నాను. భద్రానికి స్టూడియోలో ఏంపనీ ? అందులోనూ మోహినీ స్టూడియోలో ? మిష్టరీ విచ్చిపోయింది. నేనక్కడికి వెళ్ళాననుకుని ఉంటాడు. ప్రైవక్, కాదు మోహినీ స్టూడియోకు తోలు !

అసలే కాళ్ళు తీపుగా ఉన్నాయి. వాటిని యీడ్చుకుంటూ అందాకా పోతే అక్కడ ఘూర్ఖాలుండి లోపలికి వెళ్ళగూడదంటే కూడ దన్నారు. ఏంచెయ్యాలో నాకు తెలీలా. అప్పటికీ నేను కే యాస్ నని చెప్పా. నాభాష వాడికి తెలీదు. వాడిభాష నాకు తెలీదు. పైగా వాడి బొడ్డులో కత్తి ! వాడికళ్ళు చూస్తేనే అంత కుడల్లే ఉన్నాడు.

అక్కడ ఎంతసేపు నిలబడ్డానో ఎవరికీ తెలీదు. చివరకు నాకొక ఆలోచన వచ్చింది. నన్నే పోనివ్వ లేదుగదా, యీ ఘూర్ఖా నా అసిస్టెంటును లోపలికి పోనిచ్చి ఉంటాడా ? హసంభవం. ఈ మాట అనుకుని నేను వెనక్కు తిరిగేటంతలో ఒక పెద్దమనిషి లోపలికిపోబోతూ నన్నుచూసి ఆగాడు.

"అయ్యా, నన్ను డిటెక్టివు కె యాస్ అంటారు. స్టూడియోలో చిన్న మిష్టరీ విచ్చగొట్టబోతుంటే ఈ ఘూర్ఖావాడు వెళ్ళనివ్వటం లేదు" అని ఆయనతో చెప్పాను.

"ఫరవాలేదు, నేను తీసుకుపోతాను. రా !" అన్నాడాయన. ఘూర్ఖావాడు ఆయనకు సలాంకొట్టి, నన్ను కూడా ఆయనవెంట వెళ్ళనిచ్చాడు.

"మీపేరేమిటి సార్ ?" అన్నాను.

"తిక్కా వీరశంకరం" అన్నాడాయన.

"మీరు డిటెక్టివా సార్ ?" అన్నాను.

"కాదుగాని, డిటెక్టివు కథలు రాద్దా మనుకుంటున్నాను."

"రాయండి సార్, మాబోటివాళ్లం చదువుతాం."

ఇట్లా మాటాడుకుంటూ మేం లోపల ఉద్యాన వనాల మధ్యగా కొంతదూరం వెళ్లాం. అక్కడ వరసగా సినిమాహాళ్లు కట్టి ఉన్నై.

"షూటింగు చూడాలా ?" అన్నాడు శంకరంగారు.

"షూటింగే ?" అన్నాను నిర్ఘాంతపోయి.

"అవును" అన్నాడు. మేం ఒక సినిమాహాల్లోకి వెళ్ళటానికి నడుస్తుండగా, 'సైలెన్స్, సైలెన్స్' అని నాలుగుమూలల నుంచి ఒక్కసారే పొలికేకలు వినిపించినై.

"మనం ఇప్పుడు లోపలికి పోగూడదు" అన్నాడు శంకరం.

"రెడీ...షాట్!" అని నా చెవిలో ఎవరో అరిచినట్టయింది. నా గుండె ఝల్లుమన్నది. ఒళ్ళంతా చెమటపట్టింది. ఢాం మని తుపాకీపేల్చిన చప్పుడయింది. తరవాత అంతకుడి గొంతు భయం కరంగా, "ఛీ, తప్పుడుముండా! మళ్ళీ నా గడప ఏమని తొక్కావ్?" అని అరిచింది. వెన్వెంట ఒక ఆడది హా ర్త నాథం చేసింది. "కట్" అని ఇంకెవరో అరిచాడు. "లైట్సాఫ్!"

నాకు దడపుట్టుకొచ్చింది. నా చెవులఎదటే హత్య జరిగింది. తుపాకి చప్పుడు విన్నాను. అంతకుడు "షూట్" అనటం విన్నాను. ఇంకో అంతకుడు–ఈకేసులో కనీసం ఇద్దరు అంతకులున్నారు—ఒక స్త్రీని తిట్టటం విన్నాను. ఆ స్త్రీ హా ర్తనాథం చెయ్యటం విన్నాను. తరవాత మొదటి అంతకుడు, రెండో అంతకుడితో "కట్" అని చెప్పటం కూడా విన్నాను. ఈపాటికి ఆ స్త్రీని ముక్కలుచేసి గోతంలో కూరి ఉంటారు!

నేనిప్పుడేం చెయ్యాలి? ఎటువంటి సమయంలో నాకు అసిస్టెంటు లేకుండా పొయ్యాడూ! పోలీసులకు ట్రంకుచేస్తే? ఎక్కణ్ణుంచి చెయ్యనూ? నే నెన్నడూ చెయ్యలేదు. ఎవరిచేతనా చేయించాలి. ఆ భద్రం ఉంటే ఎంతబాగుండును! అన్నట్టు—ఆయనెవరో!—నా వెంటొచ్చి నాయన ఏమైనట్టు?

నిజానికి ఈ మిష్టరీ నేనే విచ్చగొట్టాలి. ముందుగాపోలీసుల్ని ట్రంకు చెయ్యటం, మామూలు మనుషులు చేసే పని. కాని ఎందుచేతో నాకు అక్కడ ఉండ బుద్ధి కాలేదు. కాళ్ళు వణుకుతున్నాయి. పోవాలి. బయటపడితేగాని నాకు ఏ ఆలోచనా తోచదు. ఇద్దరు అంతకులు ఎక్కడో దాగిఉన్నారు. వాళ్లయినా సామాన్యమైన అంతకులా? తెగబడ్డవాళ్ళు. "షూట్!" అని ఆ

అంతకు డరవటం నా చెవిలో ఇంకా మోగుతున్నది. తరవాత ఢామ్మని శబ్దం!...అన్నట్టు, ఆ శబ్దం వినపడ్డాక ఆ స్త్రీ హార్త నాథం అంత అలస్యంగా వినిపించిందేం? ఇందులో ఇంకేదో మిష్టరీ ఉంది! అమ్మో, లోతైన కేసు—బహు లోతు.

"హలో, కే యాన్?"

హులిక్కిపడ్డాను! కాని మరెవరో కాదు, ఆయనే—తిక్క శంకరం—కాదు తిక్కా వీర శంకరం!

"ఇక్కడెందుకూ? షూటింగై పోయింది! వాళ్లంతా వచ్చేస్తారు!"

"మీకు ఈ కేసులో ఎటువంటి సంబంధంఉందో నేను తెలుసుకోవచ్చా?" అని ఆయన్ని కఠినంగా అడిగాను. దానికి కారణం ఉంది. నే నప్పుడు అంతగా పట్టించుకోలేదుగాని, ఈ మనిషికి ఈ హత్య గురించి ముందే తెలుసు. "షూటింగు చూడాలా ?" అని అప్పుడే అడిగాడు. ఇప్పుడు వచ్చి, "షూటింగు అయిపోయింది" అంటున్నాడు. నేను కేసులో పని చెయ్యకుండా చెయ్యటానికి "ఇక్కడెందుకూ?" అని బయలు దేరదీస్తున్నాడు. హత్య జరిగినప్పు డీమనిషి ఏమైనట్టు? అంతకుల్లో ఒకడు కాదు గదా?

ఇంతలో సినిమా హాల్లోనించి చిత్రమైన మనుషులూ, మామూలువాళ్ళూ కలిసి బయటికి రాసాగారు. ఆ చిత్రమైన మనుషుల్ని చూపించి, వాళ్లెవరని శంకరాన్ని అడిగాను.

"వాళ్ళు వేషాలు వేసేవాళ్ళు!" అన్నాడాయన.

ఆ వేషాలు వేసిన వాళ్లల్లో ఒకడు అచ్చంగా భద్రం మల్లేనే ఉన్నాడు. కాని వీడికి మీసాలున్నయి. లేకపోతే భద్రమనుకునే

వాణ్ణే.వాడు నన్నుచూచి భయపడ్డవాడల్లే చాటుచాటుగా తప్పుకు పోవడం చూస్తే, అంతకుల్లో వాడొకడా అని అనుమానం వచ్చింది. కాని వాణ్ణి అటకాయించి పేరడుగుదామనుకుంటుండగా శంకరంగారు నన్ను తీసుకుని బయటికు వచ్చాడు.

ఆ తరవాత ఇద్దరమూ కలిసి హోటలుకు పోయి భోజనం చేశాం. నన్ను గురించి శంకరంగారు చాలా ప్రశ్నలు వేశాడు. ఆయన్ని చూస్తే నాకు హాశ్చర్యమయింది. ఇంతకాలంగా నేను డిటెక్టను చేస్తుంటే ఒక్కడూ నన్ను గురించి అడిగిన పాపాన పోలేదు. ఈయన మటుకు నా విషయం తెగ విన్నాడు. ప్రపంచంలో మంచివాళ్ళు కూడా ఉంటారు!

నాభోజనానిక్కూడా పాపం, ఆయనే డబ్బులిచ్చాడు. తరవాత కూడా ఆయన నా వెంబడి వచ్చాడు. వొంగి లోపలికెళ్ళి కూచున్నాం.

"ఏమండీ మీరు చాలా కాలంగా పట్నంలో ఉన్నారు గదా, ఇక్కడ నాకు పోటీ జాస్తిగా ఉంటుందంటారా?" అని అడిగాను.

"నాకు తెలిసినంతవరకూ ఈ పట్నంలో డిటెక్టివన్నవాడు లేడు. నువ్వే మొదటివాడివి. ఎగతాళి కాదు." అన్నాడు.

నాకు చాలా సంతోషమేసింది.

"మరి ఇంతకుముందు జరిగిన కేసు తీసుకుని నన్ను పని చెయ్యమంటారా? మీ సలహాచెప్పండి. మీరు చెయ్యమంటే చేస్తాను, ఒగ్గెయ్యమంటే ఒగ్గేస్తాను!" అన్నాను.

ఆయన కొంచెంసేపు ఆలోచించి, "నా సలహా ఏమంటే, సినిమా స్టూడియోల్లో చాలా మిష్టరీలుంటయి, వాటిజోలికి పోవటం మంచిదికాదు. నువు చూసినది సినిమాహాలు కాదు.దాన్ని ఫ్లోరం

టారు—ఫ్లోరు. షూటింగుకు పిస్తోళ్లూ, తుపాకులూ వాడరు, హా ర్తనాథాల్ని కూడా పట్టించుకో నవసరంలేదు'' అన్నాడు.

''మీరు చెబుతున్నారు గనక ఈ కేసు మరి ఒగ్గేస్తాను. కాని ఒక్కటి దాచకుండా చెప్పెయ్యాలి. అనుమానితుల లిస్టులో మిమ్మల్ని కూడా వేశాను, ఏమనుకున్నారో!''

''నన్నే? చంపేశావు!''

''అంతా బాగానే ఉందిగాని, ఈ భద్రంగాడి మిష్టరీ తేలక పోయేనే?''

నేనీమాట అన్నానో లేదో, ''అదేంటి, గురో?'' అంటూ భద్రమే వొంగి లోపలికొచ్చాడు.

''నీతాడుతెగ. నీకోసం స్టూడియో అంతా వెతికితినే?'' అన్నాను.

''స్టూడియోలో నాకేం పనీ?'' అన్నాడు భద్రం.

''వాడెవడో అన్నాడే?''

''ఏమన్నాడు గురో?''

''స్టూడియో కళ్లె ళ్ళావావటాన్నాడు.''

''ఏవడాడూ?''

''నేను వాడి పేరడిగానూ? వెళ్ళకపోతే వెళ్ళ లేదన్రాదూ? కాని ఎంతగొప్ప మిష్టరీ! లేకపోతివి!''

జరిగిందంతా భద్రానికి చెప్పాను. వాడిమొహం ఎర్రగా కందగడ్డల్లే అయింది. వాడు లేచి వొంగకుండా బయటికి వెళ్ళ బోయి తల మండిగానికి కొట్టుకున్నాడు. బయట వాడు ఏడుస్తు న్నట్టు చప్పుడయింది. అంత దెబ్బ తగిలి ఉంటుందా అని హాశ్చర్యపడుతూ నేను బయటికి వెళ్లేసరికి వాడు పొట్ట చేత పట్టుకుని నవ్వుతున్నాడు.

నా వెనకాడితే శంకరంగారుకూడా వొంగి బయటి కొచ్చాడు. ఆ తరవాత ఆయన భద్రాన్ని వెంటబెట్టుకుని ఎటో వెళ్ళిపోయి నాడు. వాళ్ళు మలుపు తిరిగేదాకా చూస్తూనే ఉన్నాను. భద్రం ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

మిష్టరీ! స్టూడియోలో అంతకులను గురించి విని భద్రానికి అంత నవ్వెందు కొచ్చింది?

ఆలోచిస్తున్నాను. భద్రం ఇంటికొచ్చినాక ఈ మిష్టరీ విచ్చ గొడతాను!...

★